క్లుప్తంగా

భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత

జి.సిగడాం: గ్రామాల్లో నెలకున్న భూ సమస్యలపై సంబంధిత వీఆర్వోలు, సిబ్బంది కలిసి ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ మహాదేవు సరిత సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వేయర్లు, వీఆర్వోలతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నిర్మల, ఆర్ఎస్ డీటీ కె.గాయత్రి, ఆర్ఐ ఎ.రాధ, వీఆర్వోలు భూపతి నర్సింగరావు, పాట్నారు జగన్నాథం, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో విజయ గణపతి


పూజలందుకుంటున్న విజయ గణపతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో వేంచేసిన విజయ గణపతి ఆలయంలో స్వామివారికి బుధవారం ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

చిన్నారి వైద్యానికి సాయమందించండి

శ్రీకాకుళం కల్చరల్: టెక్కలికి చెందిన శ్రీకాంత్, శృతి దంపతుల 7 నెలల చిన్నారికి కాలేయ మార్పిడి ఆపరేషన్ జరగాల్సి ఉందని, దాతలు ముందుకు వచ్చి సాయం అందించాలని ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ప్రతినిధి నంది ఉమాశంకర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఆపరేషన్‌కు సుమారుగా రూ.25 లక్షలు అవసరమవుతుందని, ఆర్థిక స్తోమత లేకపోవడంతో దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. సాయం చేయాలనుకునేవారు 70080 14792, 90306 24875 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పరామర్శ


చంద్రయ్యపేటలో పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

జి.సిగడాం: మండలంలోని చంద్రయ్యపేట గ్రామానికి చెందిన నక్కన గోవిందరావు తల్లి ఇటీవల మృతి చెందారు. దీంతో వీరి కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ బుధవారం పరామర్శించారు. ఆయనతో పాటు మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, సర్పంచ్‌లు తొత్తడి రామారావు, బొల్లా జనార్దనరావు, త్రినాథరావు, పైడితల్లి, ఎంపీటీసీ తిరుమరెడ్డి లక్ష్మణరావు, పిట్టా భాస్కరరావు తదితరులు ఉన్నారు.

రోడ్డు మధ్యలో పశువుల సంచారం


రోడ్డు మధ్యలో పశువుల సంచారం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని పలు కూడళ్లు, ముఖ్యమైన ప్రదేశాల వద్ద ప్రధాన రోడ్ల మధ్యలో పశువుల సంచారంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం రాత్రి అరసవల్లి కూడలి వద్ద సన్‌రైజ్ హోటల్ ఎదురుగా పశువులు రోడ్డు మధ్యలో ఉండిపోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అలాగే పాదచారులు, వాహనదారులు కూడా ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై పశువులు సంచరించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రయాణం.. నరకప్రాయం..!

- శ్రీకాకుళం నగరంలో అధ్వానంగా రోడ్లు
- ప్రమాదాలబారిన ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


పాతబస్టాండ్ అన్నా క్యాంటిన్ వద్ద గుంతలమయమైన ప్రధాన రోడ్డు


మున్సిపల్ కార్యాలయం ఎదురుగా...

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి రోడ్లు, భవనాల పనులు వేగవంతం చేస్తామని చెప్పిన మాటలు నీటిమూటలయ్యాయి. ముఖ్యంగా శ్రీకాకుళం నగరంలోని రోడ్లు రాళ్లుతేలి, గుంతలతో దర్శనమిస్తున్నాయి. ఫలితంగా ఈ రోడ్లపై ప్రయాణం ప్రజలకు నరకప్రాయమవుతోంది. నగరంలోని పాతబస్టాండ్ నుంచి అరసవల్లి మిల్లు జంక్షన్ వరకు ఉన్న రోడ్డు, ఏడురోడ్ల కూడలి నుంచి పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు యాతపేట వరకు, సూర్యమహల్ కూడలి నుంచి ఉమెన్స్ కాలేజీకి వెళ్లే రోడ్డు, డే అండ్ నైట్ నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ఉన్న రోడ్లు గుంతలమయంగా మారాయి. దీనికి తోడు చాలాచోట్ల కుళాయి పైపుల కోసం రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు తవ్వడం, పనైపోయాక పైపైన కప్పేసి వదిలేస్తున్నారు. దీంతో క్రమేపీ అవి పెద్ద గుంతలుగా తయారవుతున్నాయి. కొన్నిచోట్ల రోడ్డు మధ్యలో పెద్ద గుంతలు ఉంటున్నాయి. ఇవి గమనించని వాహనదారులు వేగంగా వచ్చి ప్రమాదాలబారిన పడుతున్నారు.

నాసిరకం పనులు

కాగా రోడ్ల మరమ్మతులను నాణ్యతా ప్రమాణాలు లేకుండా చేపడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగైదు నెలల క్రితం నగరంలో రెండు రోడ్ల గుంతలు పూడ్చడానికి సుమారు రూ.10 లక్షలకి పైగా వెచ్చించి నాసిరకం పనులు చేసి చేతులు దులుపుకున్నారు. తారుపోసి రోడ్డు వేసినా గుంతలుగుంతలుగానే ఉంది. అంతేకాకుడా అక్కడక్కడ మరమ్మతులు చేసేటప్పుడు ఎత్తుపల్లాలుగా ఉండడంతో మరింత ప్రమాదకరంగా మారాయి. దీంతో ప్రజలంతా గతంలో ఉన్న గుంతలే నయమని చెబుతున్నారు. ప్రధానంగా కృష్ణాపార్కు ప్రాంతం, ఉమెన్స్ కాలేజీ రోడ్డులో రోడ్లు చాలా దారుణంగా మారాయి. రోడ్డులో ఉన్న ఎత్తుపల్లాలు గమనించనివారు రాత్రి వేళల్లో తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారు. పాలకులకు అనుకూలమైనవారికి కాంట్రాక్టు పనులు అప్పగించడం వల్ల నాణ్యతా లోపాలు ఎత్తిచూపే ధైర్యం ఎవరూ చేయలేకపోతున్నారని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవచూపి పూర్తిస్థాయిలో రోడ్డు పనులు పూర్తిచేసి ప్రజలకు ప్రమాదాల నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు. ఆర్అండ్‌బీ రోడ్లకు కార్పొరేషన్‌కు సంబంధం లేదని ఎవరికివారు తప్పించుకుని ప్రజలను ఇబ్బందులుకు గురిచేయడం సరికాదని పేర్కొంటున్నారు. ఏడాది కూటమి పాలనలో ప్రచారాలే తప్ప, అభివృద్ధి, సంక్షేమం ఎక్కడా కనిపించడం లేదని మండిపడుతున్నారు.

భయమేస్తోంది



శ్రీకాకుళం నగరంలో రోడ్లు కన్నా కొండ ప్రాంతాల్లో ఉండే రోడ్లు బాగున్నాయి. నగరంలో ప్రయాణించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. కుటుంబాలతో ద్విచక్ర వాహనాలపై వెళ్లాలంటే భయమేస్తోంది. ఏ గుంతలో పడి ఎక్కడ ఎటువంటి ప్రమాదానికి గురవుతామో తెలియడం లేదు. పాలకులు స్పందించి మంచి రోడ్లు నిర్మిస్తే ప్రమాదాలకు గురవ్వకుండా ఉండే పరిస్థితి ఉంటుంది.

– టి.ఉమామహేశ్వరరావు, శ్రీకాకుళం నగరం

చర్యలు చేపడతాం



నగరంలో రోడ్లు గుంతలమయంగా ఉన్న మాట వాస్తవమే. కార్పొరేషన్ పరిధిలో ఉండే రోడ్ల గుంతలు పూడ్చేందుకు చర్యలు చేపడతాం. ఉమెన్స్ కాలేజీ రోడ్డు, 80 అడుగుల రోడ్డు, జిల్లా పరిషత్ రోడ్డు మాత్రమే కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. మిగిలిన పాలకొండ రోడ్డు, కళింగ రోడ్డు, పాలిటెక్నిక్ కాలేజీ రోడ్డులు ఆర్అండ్‌బీ రోడ్లు. ఆ రోడ్లపై సంబంధిత శాఖ అధికారులే దృష్టి సారించాలి. వాటితో మాకు సంబంధం ఉండదు.

– పీవీవీడీ ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం కార్పొరేషన్.


2వ పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద...


పాలకొండ రోడ్డులో పెద్దరెల్లివీధి వద్ద..

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ కారుపై దాడి హేయనీయం


మాట్లాడుతున్న పిన్నింటి సాయికుమార్ తదితరులు

రణస్థలం: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ కారుపై టీడీపీ మూకల దాడి హేయనీయమని వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకుడు పిన్నింటి సాయికుమార్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో జరగాల్సిన ఎన్నికలను టీడీపీ శ్రేణులు గందరగోళం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ కారుపై రాళ్లు, పెట్రోల్ బాటిళ్లతో దాడికి పాల్పడడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి దాడులకు పాల్పడినవారిపై ప్రభుత్వం వెంటనే శాఖపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, నాయకులు మహంతి చినరామినాయుడు, కలిశెట్టి కన్నంనాయుడు, పిన్నింటి లక్ష్మంనాయుడు, లంక సీతంనాయుడు, మహంతి జోగినాయుడు, లంక అసిరినాయుడు తదితరులు ఉన్నారు.

సుడా సెక్రటరీగా సురేష్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శిగా ఎల్.సురేష్‌ని నియమిస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయనను మున్సిపల్ కమిషనర్ గ్రేడ్–2 నుంచి గ్రేడ్–1 అధికారిగా సుడాకు బదిలీ చేశారు. ఇప్పటివరకు ఈ స్థానంలో పనిచేస్తున్న ఎంవీ లక్ష్మి సెలవులో ఉన్నారు. సెలవులు ముగిసిన అనంతరం తదుపరి పోస్టింగ్ ఇవ్వనున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మున్సిపల్ ఇంజినీర్‌గా శ్రీనివాసులు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీర్‌గా బి.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటివరకు కర్నూలు మెడికల్ కాలేజీలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా నాలుగేళ్లు విధులు నిర్వహించి పదోన్నతిపై విచ్చేశారు. అంతకుముందు అనంతపురంలో ఏడాది, కడపలో నాలుగేళ్లు డీఈగా పనిచేశారు. కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు పరుగులు పెట్టించేందుకు చర్యలు చేపడతామన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చేస్తానని, ఎటువంటి అక్రమాలకు తావులేకుండా బాధ్యతలు నిర్వహిస్తానన్నారు. ప్రజాప్రతినిధులు, కమిషనర్ ఆదేశాలను పాటిస్తూ కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వర్సిటీ అధికారులు

ఎచ్చెర్ల: రాష్ట్ర ప్రభుత్వం దిశా నిర్దేశం మేరకు క్వాంటమ్ టెక్నాలజీ, క్వాంటమ్ వ్యాలీలో భాగంగా క్వాంటమ్ హ్యాకథాన్ పేరిట సాంకేతిక సమస్యల పరిష్కారానికి సంబంధించి విద్యార్థులకు బీఆర్ఏయూ పోటీలను నిర్వహించనుంది. దీనికి సంబంధించిన ప్రత్యేక పోస్టర్‌ను వీసీ ఆచార్య కేఆర్ రజనీ, వర్సిటీ ఉన్నతాధికారులు సంబంధిత విభాగాల అధ్యాపకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. క్యాంపస్ స్థాయిలో ఈనెల 17వ తేదీన జరిగే ఈ పోటీల్లో గణితం, భౌతికశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు పాల్గొంటారని వీసీ తెలిపారు. ప్రతిభ కనబర్చినవారు రాష్ట్రస్థాయిలో జరిగే అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ పోటీలకు హాజరవుతారన్నారు. అదేవిధంగా క్వాంటమ్ కంప్యూటింగ్‌పై వర్సిటీ అధ్యాపకులకు సెప్టెంబర్ 2వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఎఫ్‌డీపీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, ప్రిన్సిపాల్స్ డా.ఎస్.ఉదయభాస్కర్, డా.సీహెచ్ రాజశేఖరరావు, ఎస్‌వో డాక్టర్ కె.సామ్రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలే శ్రీరామరక్ష!

- వరిసాగులో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి
- ఊభాలు జరిగాక సాగునీటి కొరత ఉండరాదు
- ఎరువుల వాడకంలో అప్రమత్తత అవసరం


నాట్లు వేస్తున్న దృశ్యం


బెండి బాబ్జీ, వ్యవసాయాధికారి


వరి పొలంలో యూరియా జల్లుతున్న రైతు

జి.సిగడాం : ఈ ఏడాది వరుణుడి కరుణ లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో వరిపంట ఊభాలు ఆలస్యంగా మొదలయ్యాయి. అక్కడక్కడా వరి ఊభాలు ముందే జరిగినా సాగునీరు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఊదరగడ్డి, తుంగ తదితర కలుపు మొక్కలు పంటలో పేరుకుపోయాయి. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో వరినాట్లు జరిగి దాదాపు 20 రోజులు దాటాయి. ఈ నేపథ్యంలో రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని జి.సిగడాం మండల వ్యవసాయాధికారి బెండి బాబ్జీ పేర్కొన్నారు. ఇక్కడి నుంచి పంట చేతికందే వరకూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, ప్రధానంగా వరి మొక్క పిలకలు వేసే సమయం కాబట్టి ప్రతీ పొలంలో సాగునీరు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలిన రైతులకు సూచిస్తున్నారు.

నాట్లు పడిన 20 రోజుల నుంచి...

● వరినారు మడుల్లో నాట్లు వేసిన తర్వాత 20 నుంచి 25 రోజుల మధ్య సాగునీటిని విడిచిపెట్టాలి. వర్షాల కారణంగా పొలాల్లో నీరు ఉంటే పర్వాలేదు. లేకుంటే గట్టు ఎత్తులో నీటిని ఉంచాలి.

● ఈ ఏడాది దుక్కు సమయంలో పొలాల్లో ఎరువులు వేయలేదు. ఫలితంగా ప్రస్తుతం అన్నిచోట్లా వరి పంటలో ఎరువులు వేయాల్సి ఉంది. ఇవి వేసే సమయంలో పొలంలో నీరు అడుగు భాగం నుంచి రెండు ఇంచీలు కంటే ఎక్కువ ఉండరాదు.

● ప్రధానంగా యూరియా, డీఏపీలు చల్లాలి. ఎకరాకు 25 కిలోల యూరియాతో పాటు 25 కిలోల డీఏపీ వేయాలి. ముంపు ప్రాంతాల్లో పొటాష్ కూడా వేయాలి. ఎరువులు చల్లే సమయంలో నీరు ఒక పొలం నుంచి మరో పొలానికి వెళ్లకుండా చూడాలి. 15 రోజులు దాటిన తర్వాత పూర్తిగా కలుపు నివారణ చేపట్టాలి. ఈ సమయంలో వరి పంటపొలంలో తప్పనిసరిగా నీరు నిల్వ ఉండాలి.

● కలుపు నివారణ చేపట్టేందుకు వరిపొలంలో ముందుగా పాయలు ఏర్పాటు చేసుకోవాలి. అనంతరం తెగుళ్ల పరిశీలన చేసి వ్యవసాయాధికారుల సూచనలుతో సస్యరక్షణ చేపట్టాలి.

● ఒక పంటపొలం నుంచి వేరే పంటపొలానికి నీరు వెళ్తున్న సమయంలో తెగుళ్లు ఉన్న పంట పొలం నీరు దిగువ ప్రాంతాలకు రాకుండా చూడాలి. పొట్టదశకు వరి పంట చేరుకునే సమయానికి పొలం నిండా నీరు కనిపిస్తూ ఉండాలి. ఈ పొట్టదశలోనే సాగునీటి ఆవశ్యకత కీలకం.

● వరినాట్లు వేసిన 50 రోజులకే పొట్టదశ వస్తుంది. ఇది 20 రోజులుపాటు కొనసాగుతూ వెన్ను వస్తుంది. ఈ మధ్యకాలంలో పంటపొలంలో సాగునీరు ఉంటే వెన్నుహారం అధికంగా ఉండి, ఎకరాకు 30 పైగా బస్తాలు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది.

మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం చెప్పాలి


నిరసన తెలుపుతున్న ఐఎంఎల్ యూనిట్ కార్మికులు

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని ఐఎంఎల్ డిపోను ఎవరి ప్రయోజనాల కోసం విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు చేస్తున్నారో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమాధానం చెప్పాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. టెక్కలిలో డిపో ఏర్పాటు చేయవద్దు, మా డిపో మాకు ముద్దు అని చెవిలో పువ్వులు పెట్టుకుని ఎచ్చెర్లలో ఐఎంఎల్ హమాలీలు బుధవారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఎచ్చెర్ల ఐఎంఎల్ విడదీయడానికి ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని, ఐఎంఎల్ డిపోకి భూములిచ్చిన కార్మికుల పొట్టలను కొట్టొద్దని కోరారు. పేదల భూములు తీసుకుని పరిహారంగా ఉపాధి కల్పించి, ఇప్పుడు ఆయా కుటుంబాలు ఉపాధి కోల్పోయేలా ఉత్తర్వులను జారీ చేయడం అన్యాయమన్నారు. నిరసనలో హమాలీల యూనియన్ నాయకులు డి.బంగార్రాజు, టి.రామారావు, నిడిగింట్ల రమణ, శ్రీనివాసరావు, గజనీ, లండ సీతారాం, లింగాల రాము, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న హెల్త్ ఆఫీసర్ సుధీర్‌కుమార్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం జిల్లా 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్‌కుమార్ సూచించారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శానిటరీ సెక్రటరీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ పబ్లిక్, ప్రైవేటు మరుగుదొడ్లకు సంబంధించిన ఔట్‌లెట్లకు దోమతెరలు వంటివి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని ప్రాంతాల్లోని విద్యుత్ స్తంభాలు, ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు వంటివి తొలగించి సుందర నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. అంతేకాకుండా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం


ఎచ్చెర్ల: మాట్లాడుతున్న డాక్టర్ కూర్మాన వినోద్‌కుమార్


శ్రీకాకుళం అర్బన్: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు సీడీపీవో నాగరాణి అన్నారు. నగరంలోని మహాలక్ష్మినగర్ కాలనీ, కుమ్మరివీధి అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వలన బిడ్డకు, తల్లికి ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ముర్రుపాలలో బిడ్డకు కావాల్సిన విటమిన్లు, పోషకాలు ఉంటాయని తెలియజేశారు. మహాలక్ష్మి కాలనీ సెక్టారు సూపర్‌వైజర్ కె.కల్యాణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎల్.శ్యామలత, జి.రమణమ్మ, ఏఎన్ఎం త్రివేణి, ఆశావర్కర్ కె.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: స్థానిక కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలలో తల్లిపాల వారోత్సవాలను ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కూర్మాన వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వలన తల్లి ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందన్నారు. అదేవిధంగా పిల్లలకు కూడా అనారోగ్య సమస్యలు రావని పేర్కొన్నారు. సాధారణ ప్రసవం అయిన స్త్రీలు తమ బిడ్డకు ఒక గంట వ్యవధిలో, శస్త్ర చికిత్స ద్వారా ప్రసవం అయిన బిడ్డకు తల్లి 4 గంటల వ్యవధిలో తల్లిపాలు ఇవ్వవచ్చని వివరించారు. కళాశాల అసోసియేషన్ డీన్ డాక్టర్ కె.మోషా మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకి ఔషధం వంటివన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన


సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో మహిళల జూనియర్ డిగ్రీ కళాశాలలో ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రాథమిక చికిత్సలో ప్రాణ రక్షణ, గుండె పునరుత్తేజం (సీపీఆర్), విపత్తు నిర్వహణపై అవగాహన కల్పించారు. రానున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం జిల్లా కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్ సూచనల మేరకు రెడ్‌క్రాస్ పర్యావరణ పరిరక్షణ దళం సభ్యులు మూడు రోజులుగా సాధన చేస్తున్నారు. 157 మంది ఈ శిక్షణలో పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు

ఎచ్చెర్ల: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని మండలంలోని కొయ్యవానిపేట ఎంపీయూపీ స్కూల్ హెచ్‌ఎం ఎం.రమాకుమారి పేర్కొన్నారు. పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ధర్మవరపు రామును పాఠశాలలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.గోవిందరావు, పాఠశాల కార్యదర్శి కె.తేజేశ్వరరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కరుణాసాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు పి.రవికుమార్, బి.విజయకుమార్, ఐ.రేవతి, ఎస్.అరుణ, ఎం.సునీత, కె.శ్యామసుందరరావు, పి.భాగ్యలక్ష్మి ఎస్.సందీప్‌లను హెచ్‌ఎం, ఉప విద్యాశాఖాధికారి విజయ కుమారి బుధవారం ఘనంగా సత్కారం. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.